క్లుప్తంగా

రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏఓ హేమసుందర్‌రెడ్డి

గడివేముల: నకిలీ మందులు, విత్తనాలు రైతులకు అంటగట్టితే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి హేమసుందర్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం మండల పరిధిలోని కరిమద్దెల గ్రామంలో ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన ధరలకే మందులు విక్రయించాలని, కొనుగోలు బిల్లులు ఇవ్వాలన్నారు. అలాగే గ్రామాల్లో ఎవరైనా కల్తీ విత్తనాలు విక్రయిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో వీఏఏ భావన పాల్గొన్నారు.

10 లోపు పంట నమోదు చేసుకోవాలి

గూడూరు రూరల్: రబీలో పంటలు సాగు చేసిన రైతులు ఈ నెల 10వ తేదీలోపు పంట నమోదు చేయించుకోవాలని వ్యవసాయ అధికారి శ్రీవర్ధన్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గత ఏడాది అక్టోబర్ 15 నుంచి శనగ, జొన్న, వేరుశనగ, కూరగాయలు, తదితర పంటల నమోదు చేపట్టామన్నారు. ఈ నెల 10తో గడువు ముగుస్తుందని, ఇంకా ఎవరైనా ఉంటే ఆర్‌బీకేలకు వెళ్లి ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు.

ధర్మకర్త మండలి ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

గడివేముల: గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన శ్రీ దుర్గాభోగేశ్వరస్వామి ఆలయానికి కొత్తగా ధర్మకర్త మండలి ఏర్పాటు చేస్తున్నామని ఈఓ చంద్రశేఖరరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ నెలతో పాత ధర్మకర్తమండలి కాలపరిమితి ముగిసిందన్నారు. ఆసక్తి గల వారు తొమ్మిది మంది సభ్యులతో కూడిన దరఖాస్తులను ఈ నెల 26 వతేదీ లోపల కర్నూలులోని దేవదాయశాఖ ఉప కమిషనర్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

రజకుల అభివృద్ధికి సహకారం

సి.బెళగల్: రజకుల అభివృద్ధికి సహాయ సహకారం అందిస్తామని సి.బెళగల్ సర్పంచ్ పాండురంగన్న అన్నారు. శనివారం మండల కేంద్రం సి.బెళగల్‌లోని మండల రజకుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సర్పంచ్, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరై ప్రభుత్వం రజకులకు అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాల గురించి వివరించారు. అనంతరం జిల్లా రజక వృత్తిదారుల సంఘ 2023 సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా రజకుల సంఘం కార్యవర్గ సభ్యుడు రామకృష్ణ, ఉప సర్పంచ్ ఎస్‌ఎం ఇబ్రహీం, మండల రజకసంఘం నాయకులు పాల్గొన్నారు.

రసాయన మందులు వాడొద్దు



కొండాపురంలో రైతులతో మాట్లాడుతున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: రైతులు పంట సాగులో పురుగు మందులు, ఎరువుల వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ సూచించారు. శనివారం ముడుమాల, పల్‌దొడ్డి, కొండాపురం గ్రామాల్లో ఉల్లి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. రబీ పంటల నమోదును పర్యవేక్షించా రు. అనంతరం రైతులతో మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడుల సాధనకు ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచించారు. అధిక మోతాదులో రసాయనిక ఎరువులు, మందులు వినియోగించడం ద్వారా పెట్టుబడి ఖర్చులు పెరగడంతో పాటు భూమి నీరు, ఆహార పదార్థాలు కలుషితమవుతాయన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం



చెత్త సేకరణ కేంద్రం పనులను పరిశీలిస్తున్న ఈఓఆర్డీ సందీప్

సి.బెళగల్: గ్రామాలు పరిశుభ్రతంగా ఉంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ఈఓఆర్డీ సందీప్ అన్నారు. శనివారం ఈర్లదిన్నె గ్రామంలో ఆయన పర్యటించారు. నిర్మాణ దశలోని సచివాలయ భవనం, ఆర్బీకే, చెత్త సేకరణ కేంద్రం షెడ్‌లు, పూడికతీత పనులను పరిశీలించారు. అనంతరం ఈఓఆర్డీ మాట్లాడుతూ చెత్త నుంచి సంపద సృష్టించడంపై దృష్టి సారించాలన్నారు. అనంతరం గ్రామ సచివాలయంలో ఉద్యోగులు, వలంటీర్లతో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ప్రజలకు అందుబాటులో ఉండి అవసరమైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెద్దక్క తదితరులు పాల్గొన్నారు.

చేతిలో ట్యాబ్..భుజానికి బ్యాగ్.. చూడచక్కని యూనిఫాం..కాళ్లకు బూట్లు.. ఇవన్నీ కార్పొరేట్ స్కూల్ విద్యార్థులకు మాత్రమే ఉండేవి. ఇప్పుడు అవన్నీ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సమకూర్చారు. దీంతో పాటు తాజాగా పేద పిల్లల ఉజ్వల భవిష్యత్ కోసం డిజిటల్ విద్యాబోధనకు శ్రీకారం చుట్టారు.



పంచలింగాల కేజీబీవీలో ట్యాబ్‌లలో పాఠాలు అధ్యయనం చేస్తున్న 8వ తరగతి విద్యార్థినులు

అరచేతిలో ఆధునిక విద్య

- ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా విద్యాబోధన
- తొలి విడతగా 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ
- ఇప్పటికే సీబీఎస్ సిలబస్ అమలు

కర్నూలు (న్యూటౌన్): పేదల పిల్లలకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు ప్రభుత్వం డిజిటల్ విద్యాబోధనకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు బైజుస్‌కంటెంట్‌తో ట్యాబ్‌లను పంపిణీ చేసింది. వాటి ద్వారా తరగతి గదుల్లో బోధన ప్రారంభమైంది. విద్యార్థులు వాటిల్లోనే పాఠాలను చదువుకుంటున్నారు. సందేహాలు ఉంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకుంటున్నారు. తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను ఇంటికి వెళ్లి రివిజన్ చేసుకునేందుకు వీలుగా వాటిని రూపొందించారు. తొలివిడతగా కోడుమూరు నియోజకవర్గంలో మొత్తం 3,210 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. కలగా మారిన సాంకేతిక విద్యను తమ పిల్లలకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తుండటంతో పేద విద్యార్థుల తల్లిదండ్రులు మురిసిపోతున్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

ట్యాబ్‌ల వినియోగంపై ఇప్పటికే ఆన్‌లైన్ ద్వారా 8వ తరగతి బోధన చేసే టీచర్లకు శిక్షణ ఇస్తున్నారు. ట్యాబ్‌తో పాటు కంటెంట్‌తో కూడిన కార్డులను సైతం అందజేస్తున్నారు. ఇందులో -ఆయా సబ్జెక్టుల పాఠాలు తెలుగు, ఇంగ్లిష్ సహా ఎనిమిది భాషల్లో ఉన్నాయి. అదే విధంగా యానిమేషన్, వీడియో, ఆడియోలతో కూడిన పాఠ్యాంశాలు ఉన్నాయి. చదువులో వెనుకబడిన పిల్లలు సైతం సులువుగా నేర్చుకునేలా కంటెంట్‌ను రూపొందించారు. అంతేకాదు ఇంటి దగ్గర పిల్లలు ఏ మేరకు ట్యాబ్‌ను వినియోగించి చదువుకున్నారో సబ్జెక్టు టీచర్ తెలుసుకునే సదుపాయం కల్పించారు.

పోటీ ప్రపంచానికి దీటుగా..

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు కార్పొరేట్ విద్యార్థులకు దీటుగా తీర్చిదిద్దుతోంది. ఇప్పటికే నాడు-నేడు కింద స్కూళ్లను అభివృద్ధి చేసి పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించిన ప్రభుత్వం సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రవేశపెట్టింది. 2024 -25 విద్యా సంవత్సరంలో సెంట్రల్ సిలబస్‌తోనే పరీక్షలు నిర్వహించేందుకు ప్రణాళిక కూడా రచించింది. ఆ దిశగా ఇప్పటికే విద్యార్థులను ఉపాధ్యాయులు తర్ఫీదు ఇస్తున్నారు.

చాలా సంతోషంగా ఉంది



సర్కారు బడుల్లో చదువుతున్న మాకు ట్యాబ్‌లు అందజేయడం సంతోషంగా ఉంది. జగన్ మామయ్య సీఎంగా ఉండటం మా అదృష్టం. స్కూల్‌లో చెప్పిన పాఠాలు చూసుకోవడానికి, చదువుకోవడానికి బైజుస్ కంటెంట్ ట్యాబ్ ఎంతో ఉపయోగపడుతోంది. మా భవిష్యత్తుకు ప్రభుత్వం బంగారు బాట వేస్తోంది.

– ఎ హర్షిణి, 8వ తరగతి, కేజీబీవీ పంచలింగాల

పిల్లల విద్యాభివృద్ధే లక్ష్యం



ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల విద్యాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తోంది. కోడుమూరు నియోజకవర్గంలో 3,210 మంది విద్యార్థులకు ఇచ్చాం. సరళమైన భాషలో బైజుస్ కంటెంట్ ఉంటుంది. 2024-25 విద్యా సంవత్సరంలో సీబీఎస్ఈ సిలబస్‌తోనే పదవ తరగతి పరీక్షలు నిర్వహిస్తాం.

– వినోద్‌కుమార్,ఎంఈఓ కర్నూలు మండలం

నగరాభివృద్ధికి కృషి

- జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు

కల్లూరు: నగరంలోని ప్రతి వార్డు అభివృద్ధికి కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు అన్నారు. శనివారం సాయంత్రం కల్లూరు అర్బన్ పరిధిలోని 26,34,35,37వ వార్డులలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ రామయ్య, కమిషనర్ భార్గవ తేజ హాజరై శిలాఫలకాలను ఆవిష్కరించి పనులు ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కర్నూలు నగర సుస్థిరాభివృద్ధే తమ లక్ష్యమన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో పలు వార్డుల్లో సీసీరోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే, మేయర్ మాట్లాడుతూ కర్నూలు నగరంలో ప్రాధాన్యతలను అనుసరించి పనులు ప్రారంభిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



35వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, మేయర్

పాఠశాలల ప్రగతికి ప్రణాళికలు

సి.బెళగల్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, నిర్వహణకు ప్రణాళికలు రూపొందించాలని ఎంఈఓ జ్యోతి ఆదేశించారు. శనివారం స్థానిక స్త్రీశక్తి భవన్‌లో సమగ్రశిక్ష వార్షిక కార్యాచరణ ప్రణాళిక 2023-24 కార్యక్రమంపై మండలంలోని హెచ్‌ఎంలకు శిక్షణ ఇచ్చారు. పాఠశాలలో విద్యా ప్రమాణాల పెంపు, మౌలిక వసతుల కల్పనపై హెచ్‌ఎంలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈనెల ఎనిమిదో తేదీ నుంచి 19వ తేదీ వరకు పాఠశాల పరిధిలో గ్రామ సభ నిర్వహణ, పాఠశాల ఆవాస ప్రాంత ప్రణాళికల రూపకల్పన, సర్పంచ్‌లతో ఆమోదం, కాంప్లెక్స్ పాఠశాలల సమావేశాలు, మండల కాంప్లెక్స్ సమావేశంలో మండల విద్యా ప్రణాళికల రూపకల్పన పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా ఉపాధ్యాయులు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రధానోపాధ్యాయుల సమావేశం

కోడుమూరు: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల్ల సమావేశం శనివారం కోడుమూరులో జరిగింది. పాఠశాల అభివృద్ధి ప్రణాళిక, క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ తదితర అంశాలపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఎంఈవో అనంతయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ నెల 11వ తేదీలోపు పాఠశాలల అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికను సిద్ధం చేసి విద్యాశాఖ మండల కార్యాలయంలో నివేదిక అందజేయాలని హెచ్‌ఎంలకు ఆదేశించారు.



మాట్లాడుతున్న కోడుమూరు ఎంఈఓ అనంతయ్య

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

కల్లూరు: గర్భిణుల ఆరోగ్యంపై అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐసీడీఎస్ పీడీ కుమారి ఆదేశించారు. శనివారం కర్నూలు రూరల్ ప్రాజెక్టు పెద్దపాడు కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు గర్భిణుల్లో రక్తహీనత నివారణ, పిల్లల్లో పోషకాహారలోపం తగ్గించుటకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ... మెనూ ప్రకారం కేంద్రాల్లో పిల్లలకు పాలు, గుడ్లు అందించాలని సూచించారు. కార్యక్రమంలో కర్నూలు రూరల్ ప్రాజెక్టు సీడీపీఓ నాగమణి, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

27,466 ఎకరాల్లో భూముల రీ సర్వే పూర్తి

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలంలోని 21 రెవెన్యూ గ్రామాల్లో 27,466 ఎకరాల్లో భూముల రీ సర్వే పూర్తయిందని ఇన్‌చార్జ్ కర్నూలు రూరల్ తహశీల్దార్ ఐ. విజయశ్రీ అన్నారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రీ సర్వేపై ముందుగానే గ్రామాల్లో దండోరా వేయించి తెలియజేస్తున్నామన్నారు. రైతులు తమ పొలాల్లో ఉండి వివరాలను సర్వే బృందాలకు అందజేయాలని సూచించారు.

ఇస్మాయిల్‌ను విధుల నుంచి తొలగించాలి

పాణ్యం: ఆర్‌యులో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఇస్మాయిల్‌ను విధుల నుంచి తొలగించాలని కోరుతూ ఆర్‌వీఎఫ్, ఏఐఎఫ్‌బీల నాయకులు పాణ్యం పోలీసు స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. మద్యం సేవించి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురించి ఇస్మాయిల్ అసభ్యంగా మాట్లాడారని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు ప్రతాప్, వెంకటాద్రి, రియాజ్, దత్తు, నాగరాజు, బాలసుంకన్న, తదితరులు ఉన్నారు.

బస్తిపాడులో తోటబడి

కల్లూరు: మండల పరిధిలోని బస్తిపాడు గ్రామంలో శనివారం ఉల్లి పంటలో తోటబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఉద్యానశాఖ అధికారి విజయలక్ష్మి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించడంపై రైతులకు వివరించారు.

కారుణ్య నియామకాలు

కల్లూరు: నగర పాలక సంస్థలో పని చేస్తూ మృతి చెందిన ఎన్‌పీహెచ్ వర్కర్లు బి.రేవన్న, ఎం.రామాంజనేయులు కుటుంబాలకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగం కల్పించారు. వారికి శనివారం మేయర్ బీవై రామయ్య తన క్యాంపు కార్యాలయంలో నియామక పత్రాలు అందజేశారు.

గ్రూప్-1 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

పాణ్యం: గ్రూప్-1 పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఏపీపీఎస్‌ఈ సభ్యులు జీవీ సుధాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన ఆర్‌జీఎం సెంటర్‌ను పరిశీలించారు. నేడు జరిగే గ్రూప్-1 పరీక్షలకు నంద్యాల జిల్లా పరిధిలో ఏర్పాటు చేసిన 5 సెంటర్లలో 2,904 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిపారు.

ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్



ఈ తాండ్రపాడులో లబ్ధిదారురాలికి సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. శనివారం కర్నూలు మండలం ఈ తాండ్రపాడు గ్రామంలో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. అలాగే వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గాండ్ల వీధిలో విద్యుత్ స్తంభం శిథిలమై ప్రమాదకరంగా మారిందని, కొత్త విద్యుత్ స్తంభం వేయించాలని స్థానిక మహిళలు ఎమ్మెల్యేకు విన్నవించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మూడున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి కుటుంబానికి రూ.50వేల నుంచి రూ.2.50 లక్షల వరకు ఆర్థిక లబ్ధి చేకూరిందని అన్నారు. ప్రజల సంక్షేమం కోసం పరితపిస్తున్న వైఎస్ జగన్‌ను 2024లో మరోసారి సీఎం చేసుకుందామన్నారు. కార్యక్రమంలో కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ నెహేమ్యా, ఉల్చాల సర్పంచ్ విద్యాసాగర్, ఎంపీటీసీ రామ్‌నాథ్‌రెడ్డి, ఎంపీడీఓ భాస్కర్‌నాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రంగస్వామి, ఏపీఓ మహమ్మద్‌బాషా, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి వైఎస్ జగన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ అన్నారు. కర్నూలు మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. నగర పాలక సంస్థ పరిధిలోని 38,39,40వ వార్డుల్లో కొత లబ్ధిదారులకు ఎమ్మెల్యే పెన్షన్లు అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తోందన్నారు. పింఛన్లు తొలగిస్తున్నారని కొందరు ప్రతి పక్ష నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్ పెంచుకుంటూపోతున్న ఘనత వైఎస్ జగన్‌కు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ 2 నెహేమ్యా, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, సర్పంచ్ విద్యాసాగర్, ఎంపీటీసీలు, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ మహబూబ్‌బాషా, మాజీ సర్పంచ్ ఏసేపు, ఎంపీడీఓ భాస్కర్‌నాయుడు, పింఛన్‌దారులు తదితరులు పాల్గొన్నారు.



మహిళకు పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

అవ్వాతాతలకు ఆర్థిక భరోసా

- పెన్షన్ల పంపిణీ వారోత్సవాల్లో ఎమ్మెల్యే కాటసాని

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ పెన్షన్ కానుకను పెంచి అవ్వాతాతలకు ఆర్థిక భరోసా ఇస్తున్నారని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం కల్లూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద పెన్షన్ పంపిణీ వారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. డీఆర్‌డీఏ పీడీ వెంకటసుబ్బయ్య, ఎంపీపీ బోయ శారద పాల్గొన్న ఈ కార్యక్రమంలో కల్లూరు గ్రామీణ ప్రాంతాల పెన్షన్‌దారులకు ఎమ్మెల్యే పింఛన్ పంపిణీ చేసి మాట్లాడారు. కులాలకు, మతాలకు, వర్గాలకు, రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందిస్తున్నామన్నారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా 39 లక్షల మందికి పెన్షన్‌లు అందేవన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక 67 లక్షల మందికి పెన్షన్ అందుతుందన్నారు. ఈ ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని మూడున్నర ఏళ్ల పాలనలోనే నెరవేర్చారన్నారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి (మండల ప్రత్యేక అధికారి) మహబూబ్ బాషా, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ కల్లావెంకటరమణారెడ్డి, మండల ఉపాధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రకళ, జెడ్పీటీసీ ఆల ప్రభాకర్‌రెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివ శకంర్‌రెడ్డి కర్నూలు నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, కార్పొరేటర్ దండు లక్ష్మీకాంతరెడ్డి, ఎంపీడీఓ జీవీ రమణమూర్తి, ఈఓఆర్డీ రవికిషోర్, ఏఓ చంద్రశేఖర్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

ఉద్యోగ,ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యం

ఓర్వకల్లు: నిరుద్యోగ సమస్య పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రం ఓర్వకల్లులో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటసుబ్బయ్య, జిల్లా ఉపాధి కల్పనా అధికారి సోమశివారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ చదువుకున్న ప్రతి ఒక్కరికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి నియోజకవర్గంలో జాబ్ మేళాలు నిర్వహించేలా చర్యలు చేపట్టారన్నారు. ఇప్పటికే పలు పరిశ్రమల యాజమాన్యంతో మాట్లాడి విద్యావంతులైన యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగిందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను నిరుద్యోగులు అందిపుచ్చుకోవాలని కోరారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ద్వారా దాదాపు 4 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించారన్నారు. డీఆర్‌డీఏ పీడీ మాట్లాడుతూ ఎమ్మెల్యే కాటసాని చొరవతో 15 కంపెనీల ప్రతినిధులు వచ్చి 765 మందికి ఉద్యోగావకాశాలు కల్పించారని చెప్పారు. ఈ సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు వృత్తి నైపుణ్యాలను మెరుగు పరచుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీఓ శివనాగప్రసాద్, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథగౌడు, ఎంపీపీ తిప్పన్న, సర్పంచు తోట అనూష, ఎంపీటీసీ సభ్యురాలు షాకిరున్నిషా పాల్గొన్నారు.



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

వ్యక్తిగత శుభ్రతపై అవగాహన అవసరం

కోడుమూరు : యుక్త వయస్సు అమ్మాయిలు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన పెంచుకోవాలని డ్వామా పీడీ ఏసుదాసు సూచించారు. శనివారం ఎస్సీ బాలికల హాస్టల్‌లో దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి వెల్చుల జ్యోతి విద్యార్థినులకు సేఫ్టీ నాప్కిన్లు అందజేశారు. అనంతరం విద్యార్థులకు శుభ్రతపై అవగాహన కల్పించారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

గూడూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సన పేర్కొన్నారు. పెంచికలపాడులో తాగునీటి పథకాలను శనివారం ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పైపులైన్‌లు, చేతి పంపులకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపడుతున్నామన్నారు. పైపులైన్ పూర్తిగా పాడైపోయిన చోట గ్రామపంచాయతీ నిధులతో కొత్త పైపులైన్ వేస్తున్నామన్నారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని నీటి సమస్య పరిష్కారానికి ముందు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు చెప్పారు.

స్టాక్ మార్కెట్‌పై నేడు అవగాహన సదస్సు

కర్నూలు (టౌన్): నగరంలోని బళ్లారి చౌరస్తా వద్ద ఉన్న హోటల్ సూరజ్ గ్రాండ్‌లో ఆదివారం స్టాక్ మార్కెట్‌పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఫైనాన్షియల్ అడ్వైజర్, వెల్త్ కోచ్ కె.క్రిష్ణ కైలాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు, మధ్యాహ్నం ఒంటి గంటకు, సాయంత్రం 4 గంటలకు, రాత్రి 7 గంటలకు ఈ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎల్లమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

కర్నూలు (న్యూటౌన్): వెంకాయపల్లె ఎల్లమ్మ దేవస్థానం హుండీ కానుకలను శనివారం లెక్కించారు. రూ.11,11,136 నగదులో పాటు 32.04 గ్రాముల బంగారు ఆభరణాలు, 2.180 గ్రాముల వెండి ఆభరణాలను భక్తులు సమర్పించినట్లు దేవస్థానం ఈఓ సీతారామిరెడ్డి తెలిపారు. కానుకల లెక్కింపులో దేవస్థానం చైర్మన్ బేతం కృష్ణుడు, దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు, జూనియర్ అసిస్టెంట్ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

ఆయుష్మాన్ భారత్ సర్వేను త్వరగా పూర్తి చేయండి

సి.బెళగల్: ఆయుష్మాన్ భారత్ సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ రాముడు సూచించారు.. శనివారం ఆయన సి.బెళగల్ సచివాలయం - 1ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ రికార్డులు, ఉద్యోగుల హాజరు, కార్యాలయ నిర్వహణను పరిశీలించి ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామ వలంటీర్లతో సమావేశమై మాట్లాడారు. గ్రామ సర్పంచ్ పాండురంగన్న పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

సి.బెళగల్: గ్రామాల్లో గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎంపీడీఓ రాముడు హౌసింగ్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఆయన ఏఈ సుమంత్‌తో కలిసి మండలంలోని కంబదహాల్ గ్రామంలో పర్యటించారు. లబ్ధిదారులకు గృహ నిర్మాణాలపై అవగాహన కల్పించారు. తర్వాత గ్రామ సచివాలయంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో హౌసింగ్ వర్క్ఇన్‌స్పెక్టర్ రంగన్న తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో సౌకర్యాలు

పాణ్యం: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఎంపీడీఓ దస్తగిరి అన్నారు. శనివారం పాణ్యంలో లబ్ధిదారుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గృహ లబ్ధిదారులకు ప్రభుత్వమే రాయితీపై మూడి సరుకులను అందిస్తుందన్నారు. ఎవరైనా ఇంకా ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించకపోతే వెంటనే మొదలు పెట్టాలని కోరారు. పాణ్యంలోని జగనన్న కాలనీని మోడల్‌గా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఈ సుబ్బారెడ్డి, ఏఈ నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



కంబదహాల్‌లో గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాముడు